క్లుప్తంగా

గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష నేడు

పరవాడ: తానాం మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు చెప్పారు. ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకొన్న హాల్‌టికెట్‌ను వెంట తీసుకురావాలని చెప్పారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు రావాలని పేర్కొన్నారు. పరీక్ష 495 మంది విద్యార్థులు రాయనున్నారు. హాల్ టికెట్ పొందడానికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన సమయంలో కోడ్ చేసిన ఆధార్, మొబైల్ నెంబరు, ఐడీ నెంబర్లను ఎంటర్ చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుందని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పరవాడ: నాయుడుపాలెం శివారు రజకుల కాలనీలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బండారుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బండారు బాబూరావు రూ.5000 విరాళం శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బండారు శ్రావణ్‌కుమార్, కె.కృష్ణంనాయుడు, లాలం అప్పలనాయుడు, సమ్మింగ సోమేశ్వరరావు, అప్పలరాజు, చిన సోమేశ్వరరావు, ఈ.లక్ష్మీప్రసాద్, కె.అప్పలనాయుడు, పి.తాతాబాబు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాకర్స్

సింహాచలం: అడవివరంలోని పాత గోశాల జంక్షన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు శ్రీ వరాహ లక్ష్మీనృసింహ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు జి.సూర్యనారాయణ తెలిపారు. బెహరా ఆస్పత్రి, వాకర్స్ క్లబ్ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 7 నుంచి 9గంటల వరకు నిర్వహించే శిబిరంలో బీపీ, సుగర్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం వాకర్స్‌తో కలిసి బెహరా ఆస్పత్రి ప్రతినిధి మధు వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులతో మ్యూజికల్ చైర్ ఆడిస్తున్న లక్ష్మణరావు

సింహాచలం: విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని సబ్ ఇన్‌స్పెక్టర్ పాట్నూరు లక్ష్మణరావు అన్నారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో శనివారం విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, ఉద్యోగి యల్లమ్మ, పాఠకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే

సీతమ్మధార: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యథలు నానాటికీ అధికమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అక్టోబర్ 31 వరకు వివిధ దశల్లో ఉద్యమం నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే నవంబర్ నుంచి నిరవధిక సమ్మెకు దిగడానికి సైతం వెనుకాడబోమని తెలిపారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, డీఏల విడుదల, మెరుగైన పీఆర్‌సీ ప్రకటన వంటివి తమ డిమాండ్లు అన్నారు. ఏపీజీఈఏ అధ్యక్షుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైన తమ ఆందోళన పట్ల స్పందించి తక్షణమే చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవిశంకర్, విశాఖ నగర శాఖ అధ్యక్షుడు కృష్ణాజీ, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



నాడు-నేడులో ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ఎరుకునాయుడుపాలెంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని గొటివాడలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలతో పాటు నాడు-నేడులో ఆధునికీకరించిన పాఠశాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనా వికేంద్రీకరణ, ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా సచివాలయం పరిధిలోనే రైతు భరోసా కేంద్రం,విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రంథాలయం వంటి అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో సమారు రూ.89.8 లక్షలతో నిర్మించిన సచివాలయం అదనపు అంతస్తుతో పాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, సామాజిక భవనాన్ని ప్రారంభించారు. సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే సాలాపు అప్పలనాయుడు పేరుమీద విరాళం ఇచ్చిన ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.వారి బాటలోనే మిగిలిన వారు నడుచుకోవాలన్నారు. భవనానికి అవసరమైన టైల్స్ తన సొంత నిధులతో వెంటనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పలువురు ఓటీఎస్ లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాలాపు మీనా, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, హౌసింగ్ డీఈ ఏవీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు,బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,రాపేటి రాము, విరోతి అప్పలనాయుడు, బంతికోళ్ల పద్మ,సర్పంచ్‌లు గొర్లి రాజేష్,వడ్డాది అప్పలరాజు,బోకం స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు..

సబ్బవరం: గ్రామాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని అసకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పలువురు ఓటీఎస్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ముందుగా అసకపల్లిలో రూ.25 లక్షల తో నిర్మించిన సచివాలయ అదనపు భవనాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నర్సింగరరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఏవో పోతల సత్యనారాయణ,ఏఈలు అర్జున అప్పారావు, శేఖర్,సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలమణి, ఉప సర్పంచ్ కరణం సురేష్ బాబు,కర్రి హరికృష్ణ, దాలిబోయిన నారాయణరావు,శివరాజు,మడక నాయుడు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న గుండె వైద్య నిపుణుడు డాక్టర్ వాసుబాబు

సబ్బవరం: సబ్బవరంలోని అనన్య ఆస్పత్రి ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన సుమారు 150 మంది శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.బీపీ,సుగర్,ఈసీజీ,2డి ఎకో వంటి పలు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. గుండె సమస్యలు ఉన్నవారికి ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో గుండె సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు అనన్య ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ అనంత్ చెప్పారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ డి. వాసుబాబు, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ జ్యోతి, బాదిరెడ్డి లక్ష్మణ,సిబ్బంది లక్ష్మి,నాగ భారతి,హారిక తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ సంకల్పంతో కార్మికుల విజయం తథ్యం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఉక్కు సంకల్పంతో కార్మికులు చేస్తున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ పోరాటంలో కార్మికుల విజయం తథ్యమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 835వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కునగరం క్లబ్ పాలకవర్గం ఎన్నిక



నూతన కార్యదర్శి రవిరంజన్‌కు పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి జె.వి.రావు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం ఉక్కునగరం క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం డీజీఎం జె.వి.రావు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి కమిటీ సంయుక్త కార్యదర్శిగా డి. రమేష్ (ట్రాఫిక్), కోశాధికారిగా ఎన్. తాతారావు (సీఆర్‌జీ), గ్రూప్-1 కార్యవర్గ సభ్యులుగా పి.వి.ఆర్. కిషోర్, డి. మురళీమోహన్, అభిజిత్ కుమార్, మహేంద్ర సింగ్ రావత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిని, గ్రూప్-2 నుంచి ముగ్గురు సభ్యుల ఎన్నికకు సంబంధించి, ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 8.30 వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1685 ఓట్లకుగాను, 865 ఓట్లు పోల్ అయ్యాయి. రాత్రి 9గంటలు దాటిన తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు. కార్యదర్శిగా ఆర్.ఎం.హెచ్.పి ఏజీఎం రవిరంజన్ 374 ఓట్లు సాధించి, తమ సమీప అభ్యర్థి కె.ఎస్. రామాంజనేయులుపై 36 ఓట్ల తేడాతో గెలుపొందారు. అనంతరం విజేతలకు రిటర్నింగ్ అధికారి జె.వి.రావు అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేశారు.

మన చేతల్లోనే సంతోషం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సంతోషం మనిషి చేతల్లోనే ఉంటుందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సైకాలజీ విభాగంలో ‘హ్యూమన్ హ్యాపీనెస్(కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ)’ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమస్య ఉత్పన్నమైనపుడు చికిత్స చేయడం కంటే.. అది ఎదురవకుండా చూడటం ప్రధానమన్నారు. ఈ దిశగా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సిద్ధం చేయాలన్నారు. మానసిక నిపుణులు దీనికి అవసరమైన శిక్షణ అధ్యాపకులు అందించాలని సూచించారు. తద్వారా మంచి పౌరులను తీర్చిదిద్దడం, మానవ ఆనందం, ఆరోగ్యం సంరక్షించడం సాధ్యపడుతుందన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. మంచి మానవ సంబంధాలను కలిగి ఉండటం ఎంతో ప్రధానమన్నారు. కొన్ని రకాల రోగాలకు వైద్యంతో పాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక సమస్యలను దూరం చేయడానికి యోగా ఒక సాధనంగా పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మానసిక సమస్యలు పెరగడం ఆందోళన కలిగించే అంశగా మారుతోందన్నారు. సదస్సులో నిపుణులు అందించే ప్రసంగాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ సి.రాధాకాంత్ మాట్లాడుతూ నేడు టెలీ సైక్రియార్టీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆలోచనలు, మనస్సు, ప్రవర్తన సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

పెయింటింగ్ పోటీలకు స్పందన



వేసిన పాట్ పెయింటింగ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది.గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్టోరీ రైటింగ్, పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. శిబిరంలో సబ్బవరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వెంకట సన్యాసిరావు



వెంకట సన్యాసిరావు

సింహాచలం: అనకాపల్లి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పెందుర్తి మండలం గొరపల్లికి చెందిన కంచిపాటి వెంకట సన్యాసిరావు నియమితులయ్యారు. చోడవరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వెంకట సన్యాసిరావుకు అనకాపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ నియామక పత్రం అందజేశారు. తనకు పదవి ఇచ్చిన బీజేపీ పెద్దలకు వెంకట సన్యాసిరావు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి జేసీ ప్రసాదరావు

సీతంపేట: ప్రపంచ పర్యారణ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జేసీ ఇ.పి. ప్రసాదరావు కోరారు. శనివారం ఉదయం ఆయన కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ‘సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్’ అనే అంశంపై పోటీలు జరుగుతాయని, చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇస్తామని తెలిపారు. వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు ఇస్తామన్నారు. అలాగే జూన్ 5న రామకృష్ణా బీచ్‌లో పర్యావరణ పరిరక్షణ కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని, అదే రోజు 10 గంటలకు చిల్డ్రన్ థియేటర్‌లో జరగనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు, పీసీబీ ఏఈలు మూర్తి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బల్లిగిరికి భక్తుల తాకిడి



అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చనలు చేపట్టారు.

బంటాకాలనీ అభివృద్ధికి కృషి



స్థానిక సమస్యలపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: బంటాకాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీ లో శనివారం ఎమ్మెల్యే అదీప్‌రాజు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు తదితరులు పర్యటించారు. పలు వీధుల్లోకి వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇందుకోసం రాజ్య సభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి మంజూరు చేసిన నిధులతో కాలనీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కూడా నిధుల మంజూరుకు ఓకే చెప్పారు. త్వరలో ఎంపీలతో వచ్చి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. బంటాకాలనీ కాలనీ వాసులంతా ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అండగా నిలవాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 93వవార్డు నాయ కుడు దాసరి సత్తిబాబు, పార్టీ నాయకులు శంకర్, జగదీష్, వర్మ, వినోద్, శ్రీకాంత్, 8వజోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, డీఈ విజయకుమార్, ఏఈ రాజశేఖర్, రాధిక, టీపీవో ప్రమీల, ఎంహెచ్‌వో కృష్ణరాజ్, ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.నాయకులు అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ, యతిరాజుల నాగేశ్వరరావు, ఆదిరెడ్డి మురళి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలకు సంఘీబావం తెలుపుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. సబ్బవరం తాలూకా శాఖ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బాబారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమ డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేపట్టారు. బాబురావు మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,పెన్షనర్,కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిరాశే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. సీపీఎస్ రద్దు, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం వంటి 9 ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. దీక్షలకు తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు సంఘీభావం తెలియజేశారు. నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో ఉద్యోగ సంఘాల నాయకులు వైవీ రాజేశ్వరరావు, వీఎస్ బ్రహ్మ,త్రిమూర్తులు,చిరంజీవి,బాలరాజు,పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం అట్టహాసంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా చేయాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్ రాజు అధ్యక్షతన జేసీ విశ్వనాథన్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ, సూక్ష్మ సేద్యం, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా తగిన స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ కె.మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, పీడీ ఏపీఎంఐపీ, డీఎం మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్ అభివృద్ధి అధికారి సాయినాథ్, ఏడీ మార్కెటింగ్ యాసిన్ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన



చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతను శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023-24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లులో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్ఎం ఇమంది పైడిరాజు తెలిపారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

సీతమ్మధార : విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్, పి.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. మే 30వ తేదీ 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, డ్రైవరు సోదలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.